
# ముక్కుపుడక

—చావా శివకోటి



చౌదరిగారు నాకు ఇరవై అయిదు సంవత్సరాలుగా తెలుసు. దాదాపు ఒకే వయస్సు వారం కావడం వల్ల కావొచ్చు-ఒకే జిల్లాలో - ఒకే పార్టీలో కార్యకర్తలుగా ప్రవేశించడం వల్ల కావచ్చు. మొదటి రోజులలో - ఆదరంగా పలకరించుకొని విడిపోతూ వుండేవాళ్ళం.

అసలు చౌదరి ఎవరు?

నువ్వసలు చెప్పదామనుకుంటున్నదేమిటి?

నీకు పరిచయస్తుడు కావడం మూలాన మాకు జరిగేదేమిటి? అనే అనుమాన బీజాలు ఇప్పటికే మీ మెదడులోకి వచ్చి వుంటాయి.

నేను భద్రాచలంలో వుంటున్న రోజులలో పది తండాలకు, ఇరవై గుంపులకు నాయకుడిగా చలామణి అయ్యేవాడిని. నాకున్న ప్రత్యర్థి వర్గంతో ఘర్షణలు అనివార్యం అవడంతో - పోలీస్ స్టేషన్లకూ- కోర్టులకూ వెళ్ళవలసి వస్తుండేది. ఆ రోజులలోనే కొత్తగా నల్లకోటు వేసుకొని 'ఏదో న్యాయం చేయాలి' అనే తపనలో తిరుగాడుతున్న ఈ చౌదరిగారు పరిచయమయ్యాడు.

పాత ముఖ పరిచయం నాకు బాగా పనికి వచ్చింది.

ఇది రెండో అంకం అన్నమాట.

మొదట రాజకీయంగా, ఆ తరువాత వృత్తి పరంగా- కల్సుకున్నామన్నమాట.

నాకు తక్కువ ఫీజుతో - అవసరాగా వుండే మనిషి ఎట్లాగూ కావాలి కదా!

ఆ కొరత ఈయనగారి పరిచయంతో తీరి పోయింది.

**'You are Welcome'** ఎలాంటి పనివున్నా రాండి' అన్నాడు ఆప్యాయంగా.

అది మొదలు.

కొంచెం కొంచెం దగ్గరవుతూ వచ్చాం.

ఈ దగ్గర కావడం స్నేహాన్ని పెంచింది.

ఈ లోపు పంచాయితీ ఎన్నికలు వచ్చినాయి.

ట్రైబల్ ఏరియా గనుక చదువుకున్న కోయ లంబాడీల కోసం పార్టీలు వెతుకులాటలో పడినాయి. చౌదరిగారు మాత్రం - తెలివిగా ఓ కోయ అమ్మాయిని బాగా చదువు వున్నదాన్ని, అందమైన దాన్ని- మంచి మాటకారితనం వున్నదాన్ని - ఎంచుకొనగలిగాడు తన పార్టీకి.

రాత్రింబవళ్ళు శ్రమచేసి - ఆవిడనే గెలిపించు కోగలిగాడు కూడా.

చౌదరిగారి మనిషి కరుణ సమితి అధ్యక్షురాల యింది.

అప్పుడు జరిగిన విందులోనే చౌదరిగారికి వివాహ మయిందని తెలిసింది. ఈ విజయం-రాజకీయంగా జిల్లా నాయకత్వం పొందాలనే - ఆశను కల్గించింది. ''ఎక్కాల్సిన మెట్లు చాలా వున్నాయి' అనుకున్నాడు- దీక్షగా పని ప్రారంభించాడు.

అంటే.

న్యాయవాద వృత్తి పట్ల, ధ్యాస తగ్గిందన్నమాట.

అయితే - ఈ దీక్షను - పసిగట్టిన నాయకమ్మన్యులు ఇతన్నిక్కడే ఆపేందుకుగాను- సమితి అధ్యక్షురాలితో - అక్రమ సంబంధం వున్నట్లుగా వదంతి లేవదీసారు. 'కరుణ' చౌదరి వుంపుడుగత్తె అనే భావన అందరిలోనూ కలిగేలా చేయగలిగారు.

రాజకీయ కలుషిత వాతావరణం అవగాహన అయింది. రాజకీయాలంపై అసహనం కల్గింది. ఆ వెంటనే వృత్తిపైకి ధ్యాస మళ్ళించాడు. అదే ఖమ్మం మార్చి - జిల్లా హెడ్ క్వార్టరు గదా!

వృత్తిలో తల దూర్చాక - మానసికంగా స్థైర్యం వచ్చింది.

హైదరాబాద్ హైకోర్టుకు మకాం మార్చాడు.

అప్పటికి - ముగ్గురు సంతానం. దిన భత్యంకి లోటురాని స్థితి.

మా ఏరియాలో ఓ హత్య జరిగింది. రాజకీయ హత్య అది. దాన్లో నిందితులుగా నమోదయిన పన్నెండు మందికీ - జీవిత ఖైదు శిక్ష విధించారు జిల్లా కోర్టులో హైకోర్టులో ఆ కేసు టేకప్ చేసి - అందరినీ విడుదల చేయించగలిగాడు.

అది చౌదరిగారి వృత్తిలో అద్భుతమైన మలుపును తీసుకొచ్చింది.

'ఎవరా వకీలు? అద్భుతంగా వాదించాడట' అనే స్థాయికెదిగాడు.

ఈమాట అనేక కేసుల్ని లాక్కొచ్చి ఆయన కాళ్ళ ముందు పడవేసింది.

ప్రాక్టీసు పెరిగింది.

ఒకరు - ఇద్దరు - ముగ్గురు - నల్గురు అసిస్టెంట్స్

కావాల్సి వచ్చింది.

ఒక టైపిస్టు - ఇద్దరు గుమస్తాలు.

కారు-

బంగ్లా-

ఇలా ఇంతింతై వటుడింతై అన్నట్టుగా మెరుపులా ఎదిగాడు.

పిల్లలు బాగా చదువుతున్నారు.

చౌదరిగారి భార్య పేరు రాజ్యలక్ష్మి-

ఆవిడకు ఇంటిపని - పిల్లల సంరక్షణలోనే సరి పోయేది - బయట ప్రపంచానికి అసలావిడ ఒకతి వున్నట్టుగా కూడా అనిపించేది కాదు.

దైవభక్తి - పరోపకారం - ఆవిడకు మొదటి నుంచీ అలవడినాయి.

ఎంత తక్కువ వారినైనా మర్యాదగా చూసుకొనేది. వారితోనే ఎక్కువగా తీరిక వేళల్లో గడిపేది. వారితో ఇంటికెళ్ళేది. మంచి మనసులు అక్కడనే దొరుకు తాయనే భావన ఆవిడది.

రాజ్యలక్ష్మికి - ఖమ్మంలో వుండగా - ఒక కోరిక కల్గింది.

ఆదే పేరంటానికి వెళ్ళినప్పుడు.

ఆండాళమ్మగారనే ధనికురాలికున్న ముక్కు పుడక మొదట చూసినప్పుడు చాలా ముచ్చటగా అనిపించింది. ఆ తరువాత అందంగా అనిపించింది. ఆ తరువాత 'అది నాకుంటే బాగు' అనిపించింది. అంతటితో ఆగక ఆ ముక్కు పుడక నాకయితే ఇంకా బావుంటుంది' అని కూడా అనిపించింది. ఉండ్కోలేక - దాని వివరాలు ఆండాళమ్మ నడిగింది.

అడగనే అడిగింది గదా అని - నానా బడాయిలకు పోయి - కొండ మీద కొక్కిరాయంత ఘనంగా చెప్పిం దావిడ. జైపూర్‌లో - చాలా ప్రయత్నించిన మీదట మాత్రమే దొరికిందట. అషామాషీగా అందరూ దాన్ని తేలేరు ఖచ్చితంగా చెప్పింది. పైగా దానిలోని రాయి ఖరీదు అయిదు వేలని అంది.

'అమ్మో' అనుకుందావిడ మాటలు విని. 'అంత డబ్బా?' అని ఆశ్చర్య పోయింది. అయినా ఇంటికొచ్చే వరకూ - ఆ ముక్కు పుడకను సమయం దొరికినప్పుడల్లా చూస్తూనే వుంది.

ఇంటికి రాగానే చౌదరిగార్కి చెప్పింది వివరాలతో సహా.

భార్య కోరికైతే అర్థంమైంది గానీ - తీర్చగలిగే కోరిక కాదనేది కూడా ఆ వెనుకనే తెలిసింది.

మౌనంగా విన్నాడు. 'చూద్దాం' అన్నాడు. మరచి పోయాడు.

ఒకసారి కొంచెం పైసలు మిగిలినప్పుడు మామూలు ముక్కు పుడకను కొని తీసుకెళ్ళాడు. రాజ్యలక్ష్మి కిచ్చాడు. చూసింది తీసుకుంది కానీ - తృప్తి ఆవిడలో కనిపించలేదు.

పట్నం రావడం అనేక మార్పుల్ని తెచ్చినా -

పిల్లలూ పెరిగారు.

ఒకడు డాక్టరు కోర్సులో చేరాడు. రెండోవాడు లా చదివే ప్రయత్నం లో పడ్డాడు. ఆడపిల్ల పెళ్ళి - మంచి సంబంధం చూసి చేశాడు. ఇద్దరు మగపిల్లలూ - ఎవరి సంపాదన వారు సంపాదించుకోవడం ప్రారంభించాక - భార్య కోరిక గుర్తుకొచ్చింది. అదీ దేవాలయాని కెళ్తుంటే.

ఆ మర్నాడే కొన్నాడు.

ఆండాళమ్మ ముక్కు పుడక కంటే ఖరీదయినదాన్ని రాజ్యలక్ష్మి కిచ్చాడు.

ఎన్నడూ కనిపించనంత వెలుగూ - ఉత్సాహమూ - ఆవిడలో చూశాడు. అర నిమిషం ఆగకుండా



ముక్కు పుడక పెట్టుకుని - అద్దం ముందు నించుంది చూసుకుంది. మురిసిపోయింది. చౌదరిగారి ఎదురుగా వచ్చి 'బావుందా?' అని నోరు విప్పి అడిగింది కూడా.

'బావుందిలేనోయ్' అన్నాడు నవ్వుకుంటూ.

'ఆండాళ్ళమ్మ ముక్కు పుడక కంటే బావుంది.' అని ఎవరైనా అని వుంటే నిజంగా చాలా చాలా సంతోషించేది.

* * *

రాజ్యలక్ష్మి చనిపోయింది.

తృప్తిగా వున్న రోజులలోనే హాయిగా ఇహాన్ని చాలిం చింది., అదీ బాగా రాత్రవుతుండగా-

దూరంగా వున్న చుట్టపక్కాలకు - టెలిగ్రాంలు పంపారు. ఫోను కాలున్నవారికీ - ఎరుక పరిచాడు. తప్పని సరయిన వారి కోసం మనుష్యులను పంపాడు.

వారంతా ఎంత త్వరగా వచ్చినా - తెల్లారి మధ్యాహ్నం అయింది.

క్రతువు పూర్తయ్యేసరికి - బాగా రాత్రవుతుంది.

'అంటే ఇరవై నాల్గు గంటలు' అనుకుంటూ - రాజ్యలక్ష్మిని పడుకోనబెట్టిన చోటుకు వచ్చాడు. ఆవిడను చూస్తుంటే దుఃఖం ఆగింది కాదు.

ఇన్ని సంవత్సరాల సంసారిక బంధంలో తోడు నడిచిన ఒకే ఒక వ్యక్తి - సలహా ఇవ్వలేకపోయినా సానుభూతి చెప్పలేకపోయినా - ధైర్యంగా- నిర్వికారంగా కనిపించేది ఇంట్లో. ఆవిడ కంటతడి పెట్టగా చూసెరు గడు పెదవి విప్పి ఫలానా అని చెప్పలేదు గానీ మీకెందుకు ధైర్యంగా వుండండి అన్నీ సర్దుకుంటాయి' అన్నట్టుగా ప్రవర్తించేది. అలాంటి మనిషి - వెళ్ళి పోయింది.

'ఎవరున్నా లేకున్నా - రాత్రల్లా నేనుంటాను' అనుకున్నాడు కానీ - రాత్రి పది అయ్యేసరికి - ఇరుగుపొరుగువారు నల్గురయిదుగురు వచ్చారు. చౌదరి గారి ఇంటి వెనక వున్న గుడిసెలవారిళ్ళకీ సంగతి తెల్సి. దాదాపు అంతా వచ్చారు. కంట తడి పెడుతూ అక్కడే రాత్రల్లా వుండి పోయారు. న్యాయానికి ఆర్భాటం చేసి పంపిన ఏ చుట్టమూ తెల్లవారేలోపు రాలేదు.

"ఈ గుడిసెల వాళ్ళు ఇంత ఓపికగా ఎందుకు న్నారు?" అనిపించింది చౌదరిగారికి. ఆ తరువాత అర్థము అయింది. వీళ్ళ కష్ట సుఖాలలో మంచి చెడులలో ఎంతగా ఆదరంగా - ఆసరాగా వుండేదో - చెపితేగాని తెలీలేదు. అందుకే కావచ్చు. రెండోవాడి పెండ్లికి

'రెండు వందల ఏభై చీరలు కావాలండి' అంది.

నిజంగా అన్ని చీరలెందుకో నాకు అర్థం కాలేదు.

కానీ అడగలేదు.
మంచిది అన్నాడు.

90 రూపాయిల నుంచి 190 రూపాయిల వరకు రేట్లలో నిజంగానే రెండు వందల ఆరవై చీరలూ - జాకెట్లు తీసింది.

వాటిని ఎవరెవరికి ఎలా ఇచ్చిందో మాత్రం - తెలీలేదు.

గమించాలనుకుంటూనే - అశ్రద్ధ చేసాడు చౌదరి గారు - కోర్టు పనులలో పడి ఒకనాడు - రాజ్యలక్ష్మి - పడుకోనబోయే ముందు - 'ఏమండి' విషయం చెపుదా మని వుంది' అంది.

చెప్పమన్నట్టు చూసాడు చౌదరిగారు.

'ఒకవేళ నేను అకస్మాత్తుగా చనిపోయానే అను కోండి. ఈ ముక్కుపుడక నాతోనే వుంచేస్తారా? తీసేస్తారా?' అంది.

'ఎందుకు?' ఏమిటా మాటలు?' అన్నాడు.

'ముక్కుపుడక నాకు బాగుంది కదూ? నేను మొదట చూసిన ఆండాళమ్మగారి ముక్కు పుడక కంటే కూడా చాలా మంచిది తెచ్చారు. ఇదంటే నాకు ప్రాణం. దీన్ని నా నుంచి వేరు చేయవద్దు' అంది.

'నీకేమైనా పిచ్చిగాని ఎక్కుతోందా?' అని కసిరాడు -

దగ్గరగా తీసుకుని ఆ తరువాత అసలు ధ్యాసలోకి రాలేదా విషయం.

'ఏమైనా విలువైన వస్తువులుంటే తీసేయండి' అన్నమాట వినిపించి చౌదరిగారు లేచి దగ్గరకెళ్ళి 'ఇదిగో ఆవిడ ఒంటి మీద వున్న ఏ వస్తువునూ తాకకండి. అది సాంప్రదాయకం కాదనిపిస్తే మీరు తెచ్చే వాటిని పైన కట్టండి. అంతే' అన్నాడు ఖచ్చితంగా.

చాలా మంది చౌదరిని చిత్రంగా చూశారు.

'ఇదేం విడ్డూరం?' అనుకున్నారు.

కానీ ఏమీ అనలేకపోయారు.

అలాగే వెళ్ళిపోయిందా మహాతల్లి-

అది వేల రూపాయిలు ఖరీదు చేసే ముక్కుపుడక. ఆవిడతోనే మంటలలోనే కల్సిపోయింది.

రాజ్యలక్ష్మికి ముక్కు పుడక మీద అంత అభిమానం ఎందుకు?

అంతగా ముద్ర వేయగల్గిన స్థితి ఆ ముక్కు పుడకకి ఎందుకు కల్గింది?

అంటే - చౌదరిగార్కి ఇవ్వాల్టి కూడా అర్థం కాదు. కానీ - రాజ్యలక్ష్మితో పాటు ముక్కు పుడక తప్పక గుర్తుకొస్తుంది.

ఇద్దరు పిల్లలూ బాగా సంపాదించుకుంటున్నారు. ఆడపిల్లకు మంచి సంబంధం చేశాడు. రెక్కలొచ్చిన పక్షులుగా అయిపోయారు. పిల్లలకు చౌదరిగారు ఆర్థిక ఆసరా అవసరం లేదు. మరి ఈ న్యాయ శాస్త్రంలోని అన్యాయాన్ని బ్రతికిస్తూ ఇంకా ఎవరి కోసం ఈ సంపాదన అనుకునేవాడు. దాంతో - మనస్సు - దాని ప్రశాంతతా - యోగం - నిర్మలత గురించి ఆలోచనలు మొదలయినాయి. పైసల కోసమే ఇన్ని రకాలుగా మారిన చౌదరిగారు - ప్రశాంతత కోసం ఎదురు చూస్తు న్నారు. ●